'గాంధీ'లో అదనంగా 28 సీసీ కెమెరాలు

గాంధీ దవాఖానలో సీసీటీవీ కంట్రోల్ రూమ్‌లో అధికారులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 28 : గాంధీ దవాఖానలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా రూపొందించామని సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం అదనంగా మరో 28 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. సీసీటీవీ కంట్రోల్ రూమ్‌లో ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రిలతో కలిసి సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. వాటితో కలిపి మొత్తం 148 కెమెరాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని, ప్రస్తుతానికి అన్ని వైపులా నిఘా ఉన్నదని ఆమె తెలిపారు.

రుణాలు వినియోగించుకోండి

మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి

అడ్డగుట్ట, అక్టోబర్ 28 : మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి తెపారు. చిలకలగూడలో కాంగ్రెస్ సేవాదళ్ కార్యక్రమానికి శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 150 మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్, ప్రధాన కార్యదర్శి రేణుకుమార్, రాష్ట్ర యువనాయకులు శ్రావణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన ఎస్ఆర్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ కమిటీ సభ్యులు

బేగంపేట్ అక్టోబర్ 28: సీనియర్ సిటిజన్స్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎస్ఆర్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ కమిటీ సభ్యులు సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ...వయస్సును సైతం లెక్క చేయకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో నిర్వహిస్తున్న సీనియర్ సిటీజన్స్‌ను ఆయన ప్రశంసించారు. కౌన్సిల్ ఏర్పడిన నాటి నుంచి చేపడుతున్న కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చానని అన్నారు. ఇక ముందు కూడా ఇలాగే కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. తమకు అనేక విధాలుగా అండగా ఉంటూ చేయూత నిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మి బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, కౌన్సిల్ నూతన అధ్యక్షుడు బీపీ దూబే,అనంత్, కృష్ణదేవ్ పాల్గొన్నారు.

గాయకులను సత్కరించిన వకుళాభరణం కృష్ణమోహన్

అలరించిన సినీ సంగీత విభావరి

ముషీరాబాద్, అక్టోబర్ 28: స్వర కళ్యాణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఇది నా ప్రియ నర్తన వేళ శీర్షిక చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురిని అలరించింది. స్వర కళ్యాణి స్వర భాస్కర్, రామలక్ష్మి, జయరాం, జ్యోతి, లత పాడిన వేటూరి పాటలు రంజింపచేశాయి. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం, కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర రఘురాం, శశిబాల. రఘు, రాంబద్రీ నాథ్, శేఖర్, రామచంద్రారావు, రాధాకృష్ణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్,యువ నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి,అక్టోబర్28 : దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సీఎం సహాయనిధి అందజేస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. సోమవారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువ నాయకుడు ముఠా జయసింతో కలిసి 12 మంది బాధితులకు రూ.4,22000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ, రాంనగర్ డివిజన్ల అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, సంతోష్, సాయిచాణక్యరెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ నూతన అధ్యక్షుడిగా విశ్వనాథ్ రవీందర్

డాక్టర్ విశ్వనాథ్ రవీందర్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

బేగంపేట్ అక్టోబర్ 28: శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ పట్కరి(కత్రి) తెలంగాణ ప్రాంతీయ సమాజ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రిటైర్డ్ ఐపీఎస్, డాక్టర్ విశ్వనాథ్ రవీందర్‌ను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ మాట్లాడుతూ.. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మరింత బాధ్యత పెరిగిందన్నారు. సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడికి పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువతో సత్కరించారు. ఈ క్రమంలో అఖిల భారత ఏబీఎస్ఎస్‌కే ఉపాధ్యక్షుడు బాలకిషన్ మాట్లాడుతూ..నూతనంగా నిర్మించిన సంఘం భవన సముదాయంలో రేణుక మాత ఆలయ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు అందుకు తన వంతుగా రూ. 1 కోటి రూపాయలను విరాళంగా ప్రకటించారని ఏసీ సభ్యులు డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి టంకు విష్ణు, శివకుమార్, దీపారాణి, మీనాబాయ్, శివ పండిట్,వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట్ అక్టోబర్ 28: పోలీస్ సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సికింద్రాబాద్ మహంకాళి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వాడే పరికరాలు, వీటితో పాటు సిగ్నల్స్ దగ్గర రోడ్డు దాటేటప్పుడు పాటించాల్సిన నియమాలు, ఏ విధమైన జాగ్రత్తలను తీసుకోవాలో వివరించారు. చిన్నతనం నుంచి ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహంకాళి ట్రాఫిక్ ఎస్ఐలు మహేశ్,శివరాజు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను వినియోగించుకోండి

జలమండలి జీఎం వినోద్

అడ్డగుట్ట, అక్టోబర్ 28 : వన్ టైం సెటిల్‌మెంటు(ఓటీఎస్) అవకాశాన్ని ప్రజలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని మారేడుపల్లి జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. కొన్నేళ్లుగా వినియోగదారులు నీటి బకాయిలను చెల్లించడం లేదని, అలాంటి వారికి ప్రభుత్వం పెండింగ్ బకాయిలను చెల్లించుకోవడానికి అద్భుతమైన అవకాశాన్ని కల్పించిందని ఆయన తెలిపారు. ఓటీఎస్ ద్వారా బకాయిలను చెల్లించే వారికి ఆలస్య రుసుము, వడ్డీ లేకుండా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 1వ తేదీన ప్రారంభమైన ఓటీఎస్ పథకం గడువు ఈ నెల 31తో ముగుస్తుండటంతో ప్రజలు అప్రమత్తమై బకాయిలను చెల్లించాలని సూచించారు. ఒక వేళ గడువు లోపు చెల్లించని వారు తర్వాత ఆలస్య రుసుము, వడ్డీతో కలిపి బకాయిలను చెల్లించాల్సింటుందని ఆయన పేర్కొన్నారు. కావున ఓటీఎస్ ద్వారా చెల్లించేవారికి మరో మూడు రోజులు మాత్రమే ఈ అవకాశాన్ని ఉన్నందున ప్రజలు జాగ్రత్త పడాలన్నారు. ఓటీఎస్ గడువు ముగిసిన తర్వాత పూర్తి బకాయిలను చెల్లించడం కంటే ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడం మంచిదని ఆయన పేర్కొన్నారు.

బిషప్ కౌన్సిల్ నూతన కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న బిషప్‌లు

సికింద్రాబాద్,అక్టోబర్28: తెలంగాణ బిషప్ కౌన్సిల్ నూతనంగా 250 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేసి పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. తార్నాక ఐనోస్ చర్చిలో తెలంగాణ 33 జిల్లాల నుంచి అన్ని డినామినేషన్లకు ఇండిపెండెన్స్ చర్చిలకు చెందిన బిషప్స్ తో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమం,చర్చిలకు భద్రత పాస్టర్లకు బిషప్లకు ప్రభుత్వపరంగా అధికారిక గుర్తింపు వచ్చేందుకు కృషి చేస్తామని పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. త్వరలో బిషప్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీలు మండల కమిటీలతో స్థానికంగా ఇండిపెండెంట్ చర్చిల సమస్యలపై ఆయా నియోజకవర్గాల ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి, తర్వాత సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిని కూడా కలవనున్నామని మోడరేటర్ బిషప్ విల్సన్ సింగ్, అధ్యక్షులు బిషప్ ధనరాజ్ కోట,సెక్రటరీ భాస్కర్ ముల్కల తెలిపారు.

హుండీ లెక్కింపు

చిక్కడపల్లి,అక్టోబర్28: చిక్కడపల్లి వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేశారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి దేవనాథం మాట్లాడుతూ రూ. 1,77,560 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. నవంబర్ రెండు నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని శాసిస్తున్న విజ్ఞాన విప్లవం

మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

సికింద్రాబాద్,అక్టోబర్28: విజ్ఞాన విప్లవం ప్రపంచాన్ని శాసిస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. ఒక్కో శతాబ్దానికి ఒక్కో ప్రత్యేకత ఉందన్న ఆయన... ప్రస్తుత 21వ శతాబ్దం ఆధునిక, సాంకేతిక విజ్ఞాన అభివృద్ధికి కేంద్రంగా నిలిచిందని తెలిపారు. ఆధునిక మేధో విజ్ఞానం, భారతీయ జ్ఞాన వ్యవస్థల మూలాలు, పునరుద్ధరణ అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ జి రాంరెడ్డి దూరవిద్యా కేంద్ర ఆడిటోరియంలో డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చేసిన మూడు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంకేతికత అనే పదం కొత్తగా వచ్చిందేమీ కాదని, భారతీయ మూలాల్లోనే ఉందని బాలకిష్టారెడ్డి గుర్తు చేశారు. దేశంలో నేటికి అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారం దిశగా విజ్ఞానాన్ని వినియోగిస్తే భారత్ కు ప్రపంచంలో ఎదురేలేదని స్పష్టం చేశారు. విద్యా సామాజిక బాధ్యతగా ప్రతి అధ్యాపకుడు, పరిశోధకుడు సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. కాలం విసిరే సవాళ్లు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగారం అభిప్రాయపడ్డారు. కొవిడ్ విద్యావ్యవస్థలో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. సాంకేతికత భవిష్యత్తు విద్యావిధానాన్ని సమూలంగా మార్చేస్తుందని... ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవటం ద్వారా ప్రతి అధ్యాపకుడు ఇందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్య కేవలం ఉద్యోగావకాశాలకు మాత్రమే పరిమితం కాదన్న ప్రొఫెసర్ మొలుగారం.... వ్యక్తి సమగ్ర వికాసానికి దోహదపడాలని ఆకాంక్షించారు. మూడురోజుల పాటు జరిగే ఈ జాతీయ సదస్సు డైరెక్టర్లు ఆచార్య రవీంద్రనాథ్ మూర్తి, ఆచార్య టిమృణాళిని అతిథులకు స్వాగతం పలికారు.

శ్మశానవాటికలో చెత్త,చెదారం తొలగింపు

చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 28 : దీపావళి పండుగను పురస్కరించుకుని శ్మశానవాటికలలో పారిశుధ్య పనులను జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో సోమవారం బన్సీలాల్‌పేట్‌లోని నాగన్నకుంట శ్మశానవాటికలో కార్పొరేటర్ హేమలత పర్యవేక్షణలో బల్దియా హార్టికల్చర్ విభాగంవారు గుబురుగా పెరిగిన చెట్లను, చెత్తా చెదారం తొలగించే పనులను నిర్వహించారు. డివిజన్‌లో ఏడు చోట్ల ఉన్న వివిధ శ్మశానవాటికలలో దీపావళి పండుగ రోజున ఆనవాయితీగా ప్రజలు సమాధుల వద్ద పూజలు నిర్వహిస్తారని, అందుకే తాము పారిశుధ్య పనులను చేపట్టామని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీపతి,విశాల్ పాల్గొన్నారు.

జిల్లాల్లో టెన్నిస్ కోర్టుల ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో టెన్నిస్ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్(టీఎస్‌టీఏ) అధ్యక్షుడు కేఆర్ రామన్, ప్రధాన కార్యదర్శి నారాయణ దాస్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్‌లో టీఎస్‌టీఏ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో టీఎస్‌టీఏ ఆధ్వర్యంలో టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి జిల్లాల్లో జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నీలు నిర్వహించి, గ్రామీణ స్థాయిలో టెన్నిస్ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీఎస్‌టీఏ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, యాదాద్రి-భువనగిరి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కోర్టు ఆర్డర్ లేకుండా రోడ్డు నిర్మిస్తే అడ్డుకుంటాం

అధికారులతో మాట్లాడుతున్న వినయ్‌కుమార్, బాధితులు

చిక్కడపల్లి,అక్టోబర్28: పేదల ఇండ్లు కూల్చిన చోట, కోర్టు ఆర్డర్ లేకుండా రోడ్డు నిర్మించే ప్రయత్నం చేస్తే బాధితులతో కలిసి అడ్డుకుంటామని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ హెచ్చరించారు. గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానంద నగర్ బస్తీలో పది నెలల క్రితం దళితుల ఇండ్లను ప్రభుత్వం కూల్చి వేసింది. ఇప్పటి వరకు వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపలేదు. కాగా సోమవారం ఇండ్లు కూల్చిన చోట రోడ్డు వెయ్యడానికి జీహెచ్ఎంసీ అధికారులు రావడంతో బాధితులు అడ్డుకున్నారు. పునర్ నివాసం కల్పించిన తర్వాతే పేదల ఇండ్లు కూల్చలన్న హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇండ్లు కూల్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు కూల్చి పది నెలలు గడుస్తున్న తమకు పునర్‌నివాసం కల్పించలేదని వాపోయారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ బాధితుల పక్షాన మాట్లాడుతూ కోర్టు ఆర్డర్ లేకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం అంటే సహించేది లేదన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినయ్‌కుమార్ బాధితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. బాధితులు కృష్ణ, శ్యామ్ సుందర్, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావు, తిలక్ బాబు, బీజేపీ నేతలు ఉమేశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

సమావేశంలో మెముంటోలను అందజేస్తున్న హెటిరో డాక్టర్ ఆనంద్‌రెడ్డి

సికింద్రాబాద్,అక్టోబర్28: దుర్గాబాయి మహిళా సాధికారతే ధ్యేయంగా పురుడు పోసుకున్న ఆంధ్ర మహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్, దుర్గాబాయి దేశ్ ముఖ్ విద్యా ప్రాంగణంలో చేరిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలు, విద్యార్థుల ఆశయాలు సిద్ధిస్తాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అన్నారు. ఓయూ పరిధిలోని ఆంధ్ర మహిళా సభ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్, దుర్గాబాయి దేశ్ ముఖ్ విద్యా ప్రాంగణంలో ఎంబీఏ కోర్స్ 2024-2026 బ్యాచ్ స్టూడెంట్‌లకు ఆరంభ పేరుతో సోమవారం సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన హెడ్ఎల్అండ్ఓడీ, హెటిరో డాక్టర్ ఎస్ ఆనంద్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు అవాంతరాలను ఎదుర్కొనే క్రమంలో బలహీనతలపై పోరాడుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యమైందని సూచించారు. మేనేజ్ మెంట్ (ఎంబీఏ) కోర్సు ప్రణాళిక బద్ధమైనదని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికను తయారు చేసుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ తో నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో అధ్యాపకులు మార్గనిర్దేశం చేస్తారన్నారు. కళాశాల చైర్ పర్సన్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ సంప్రదాయక కోర్సుల్లో సబ్జెక్టు పై లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంస్థ అధ్యక్షుడు ఉషాకందా, కళాశాల సెక్రటరీ సత్యనారాయణ, కళాశాల పాలకవర్గ సభ్యులు ప్రొఫెసర్ సీవీ రామ్మోహన్ రావు విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన అంబేద్కర్ కళాశాల జట్టు

విజేతలుగా నిలిచిన విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి,అక్టోబర్28 ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ 2024-25 టోర్నమెంట్‌లో 22 జట్లు పాల్గొనగా బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ క్రాస్ కంట్రీ మెడలిస్ట్ మిస్టర్ నళిని మోహన్, ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రావణ్ తదితరులు హాజరై విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం మొదటి స్థానం నిలిచిన విజేతలకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ అభినందించి సన్మానించారు.

విధుల్లో పారదర్శకత పాటించాలి

అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి

అమీర్‌పేట్, అక్టోబర్ 28 : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటిఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' ప్రతిజ్ఞ జరిగింది. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి సహ సీఈఈ రఘు, ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న సమీక్ష సమావేశంలో ఉద్యోగులు ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ పీసీబీ కార్యాలయాల్లో కాలుష్య నియంత్రణకు సంబంధించి బోర్డు రెగ్యులేటరీ విధుల నిర్వహణలో పారదర్శకత ఉండేలా ఉద్యోగులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం నిబంధనల అమలు తీరును సమీక్షించారు. సమాచార హక్కు చట్టం నిబంధనలు, ఆర్టీ అధికారులకు సంబంధించిన తాజా సమాచారాన్ని సంస్థ పోర్టల్‌లో అందుబాటులో ఉండేలా తగిన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వం తరపున సదర్ సమ్మేళనం

బేగంపేట్ అక్టోబర్ 28: యాదవుల సదర్ సమ్మేళనం ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో తెలంగాణ యాదవ సంఘం హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులో ఉన్న తెలంగాణ యాదవ సేన చైర్మన్ కట్టెల శ్రీనివాస్‌యాదవ్ కార్యాలయంలో సంబురాలు జరుపుకొని సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యాదవ సేనా ప్రతినిధులు నీలం శ్రీనివాస్‌యాదవ్,మల్లేశ్‌యాదవ్, పెండ్యం శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శశాంక్‌కు నివాళి

చురుకైన కార్యకర్తగా పార్టీకి ఎనలేని సేవలందిస్తూ నగర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఎదుగుతున్న దశలో ఊహించని ప్రమాదంలో మృతి చెందిన శశాంక్ ఆర్య బీజేపీకి అందించిన సేవలు ఎనలేనివని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం శశాంక్ ఆర్య జయంతిని పురస్కరించుకుని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు దయానంద్, మాజీ అధ్యక్షుడు రావుల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు మర్రి పురురవరెడ్డి, ఆకుల మహేశ్, సుమన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పెరుమాండ్ల నరేందర్ తదితరులతో కలిసి శశాంక్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.

-అమీర్‌పేట్, అక్టోబర్ 28

ఘన సన్మానం

ఇంటర్నేషనల్ ఎల్డర్స్ డే, ఆస్కా ఫౌండేషన్ డేలను పురస్కరించుకుని అశ్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయిని ఘనంగా సన్మానించారు. వయోధిక పౌరులకు చేయూతనిచ్చేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శాయిని ఎస్‌బీఐ అధికారి శ్రీహరి ప్రసాద్ ఆస్కా అధ్యక్షుడు పాపారావుతో కలిసి సత్కరించారు. -అమీర్‌పేట్, అక్టోబర్ 28

కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 28 : కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, కుసుమలో ముల్లులేని రకాలను కనుగొనేలా పరిశోధనలు జరుగాలని జాతీయ నూనెగింజల పరిశోధన మండలి (ఐసీఏఆర్ - ఐఐఓఆర్ న్యూఢిల్లీ) డీడీజీ డా.శర్మ అన్నారు.

సనాతన ధర్మంపై ఇంటింటికీ ప్రచారం

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని బంజారా నగర్ కాలనీ, ఐఓబీ, సూర్య ఎన్‌క్లేవ్ కాలనీల్లో రాధాకృష్ణ భక్తసమాజం ఆధ్వర్యంలో సనాతన ధర్మం హిందూ సంప్రదాయ విలువలపై ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. -బొల్లారం,అక్టోబర్ 28: